వాన కురిసే.. రైతు మురిసే..

- ఆధునిక వ్యవసాయం వైపు అన్నదాత చూపు
- అవగాహనతో మరింత దిగుబడులు
- మండలంలో పెరుగుతున్న సాగు విస్తీర్ణం

విత్తనాలు విత్తుతున్న మహిళలు

లింగాల, జూన్ 15 : నైరుతి రుతుపవనాలు ఆగమనంతో వానకాలంలో సకాలంలో వర్షాలు కురుస్తున్నాయి. ఈక్రమంలో అన్నదాతలు ఆనందంగా సాగును ప్రారంభించారు. ఆధునిక వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపడంతో మండలంలో సాగు విస్తీర్ణం పెరుగుతున్నదని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొన్నారు.

ముందస్తు ప్రణాళికతో అధిక దిగుబడి..

వ్యవసాయాధికారులు ముందస్తు ప్రణాళికతో విత్తనాలు, ఎరువులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నారు. సాగు మొదలుకొని పంటను అమ్ముకునే వరకు ఏఈవోలు రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు. దీంతో రైతులకు పంట సాగుపై అవగాహన మరింత పెరుగుతున్నది.

మొక్కజొన్నదే అగ్రభాగం..

వానలు సకాలంలో కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలో 33,500 ఎకరాలు సాగులో ఉండగా 12,545 మంది రైతులున్నారు. ఇప్పటికే మండలంలో దాదాపు 11వేల ఎకరాలకు పైగా మొక్కజొన్న పంటను సాగు చేశారు. అదేవిధంగా పత్తి 160-170 ఎకరాల్లో, జొన్నలు 120, కందులు 50 ఎకరాల్లో సాగు చేశారు. కాగా మొక్కజొన్న సాగు పెరిగే అవకాశం ఉన్నదని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

సూచనలు పాటిస్తే అధిక లాభాలు..

వానకాలంలో సాగు చేసే పంట విషయంలో రైతులు తగు జాగ్రత్తలు పాటించాలి. ఈ సీజన్‌లో వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ పంటలు సాగుచేస్తే అధిక దిగుబడులు పొందవచ్చు. సమయానుకులంగా వర్షాలు కురవకపోతే కొంతమేర దిగుబడులు తగ్గే అవకాశం ఉంటుంది. రాబోయే రోజుల్లో చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు పాటించాల్సి ఉంటుంది.

- నాగార్జునరెడ్డి, మండల వ్యవసాయ అభికారి.

గ్రామాలాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎక్సైజ్‌శాఖ మంత్రి కృష్ణారావు

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కృష్ణారావు

పెద్దకొత్తపల్లి, జూన్ 15 : గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ప్రతాప్‌గౌడ్ అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాతాపూర్ ఎంపీటీసీ వెంకటయ్య మాట్లాడుతూ పాఠశాలల భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వాటికోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. గ్రామాల్లో అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాపాలనతో గ్రామాల అభివృద్ధికోసం నిధులు మంజూరు చేస్తూ కృషి చేస్తున్నారన్నారు. ఇటీవల ఎన్నికల కోడ్ ఉన్నందున అభివృద్ధికి సంబంధించిన నిధులు మంజూరు కాలేదని ప్రస్తుతం కోడ్ ముగిసినందున అభివృద్ధికోసం తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రజాసమస్యలను తెలుసుకునేందుకు తాలూకాస్థాయిలో అధికారులను ఏర్పాటు చేశామని, అక్కడ ప్రజలు తమ సమస్యలను దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. వాట్సప్ ద్వారా అయినా సమస్యను ఇచ్చే దరఖాస్తులను పరిశీలించి సాధ్యమైనంత వరకు సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఎంపీ మల్లురవిని ఘనంగా సన్మానించారు. ఎంపీ మాట్లాడుతూ గ్రామాల్లో సింగిల్ పాఠశాలలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ పాఠశాలలను తీసివేయకుండా విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు గ్రామ ప్రజలు సహకరించాలని సూచించారు. తన వంతు గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యలకోసం పరిష్కరిస్తానన్నారు.

కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి గోవిందరాజులు, పంచాయతీరాజ్ అధికారి కృష్ణ, ఎంపీడీవో నాగేంద్ర, తాసీల్దార్ యూసూఫ్‌అలీ, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కేఎల్ఐ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి

కల్వకుర్తి, జూన్ 15 : ఎంజీకేఎల్ఐ పథకంలో భాగమైన 29 ప్యాకేజీలో పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి కేఎల్ఐ ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. శనివారం కల్వకుర్తి మండలంలో 29వ ప్యాకేజీ కాలువ, పిల్ల కాలువలతో పెండింగ్‌లో ఉన్న పనులపై ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కశిరెడ్డి ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అంతకు ముందు కాలువలకు సంబంధించిన పెండింగ్ పనులను పరిశీలించారు. పెండింగ్ పనుల వివరాలను అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. సమీక్షలో భాగంగా ఎమ్మెల్యే కశిరెడ్డి అధికారులతో మాట్లాడారు. వర్షాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో సాగునీటి సరఫరాకు ఇబ్బందులు కలుగకుండా పనులు వేగవంతంగా పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్, కేఎల్ఐ ఎస్ఈ ఏఎస్ఎన్‌రెడ్డి, ఈఈ శ్రీకాంత్, డీఈ దేవానంద్, జేఈ, ఏఈ పాల్గొన్నారు.

సాగునీరు అందిస్తాం..

వెల్దండ, జూన్ 15 : కల్వకుర్తి నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కశిరెడ్డినారాయణరెడ్డి అన్నారు. శనివారం వెల్దండ మండలంలోని చెర్కూర్ రెవెన్యూ శివారులో కేఎల్ఐ డీ 82 కాల్వ పనులను ఆయన పరిశీలించారు. జూలై లోపు పనులు పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటయ్యగౌడ్, నాయకులు సంజీవ్‌కుమార్, ఆనంద్‌కుమార్, గోపాల్, రాజశేఖర్, నారాయణ, ఎండీ ఆలీ, శ్రీనుయాదవ్, వెంకటేశ్, భరత్ ఉన్నారు.

ఉప్పునుంతలలో మెగా సర్జికల్ క్యాంప్

- ట్యుబెక్టమీ ఆపరేషన్ చేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ

మెగా సర్జికల్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

ఉప్పునుంతల, జూన్ 15 : మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మెగా సర్జికల్ క్యాంపులో భాగంగా శనివారం ట్యుబెక్టమీ ఆపరేషన్లను ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వంగూర్, చారగొండ, ఉప్పునుంతల మండలాలకు చెందిన 46మందికి ఆపరేషన్లు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాప్రతినిధిగానే కాకుండా వైద్యుడిగా నియోజకవర్గ ప్రజలకు ఆరోగ్యపరంగా అండగా ఉంటానన్నారు. అచ్చంపేట ఏరియా దవాఖానతోపాటు ఉప్పునుంతల, లింగాల, అమ్రాబాద్ మండలాల్లోని సీహెచ్‌సీ ల్లో మెగా సర్జికల్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నామని, పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి తారాసింగ్, డీసీహెచ్ రమేశ్‌నంద్ర, సూపరింటెండెంట్ ప్రభు, స్థానిక వైద్యాధికారి బిక్కూనాయక్, ఎంపీపీ అరుణానర్సింహారెడ్డి, జెడ్పీటీసీ ప్రతాప్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ భూపాల్‌రావు, నాయకులు అనంతరెడ్డి, మోపతయ్య, జగన్‌మోహన్ రెడ్డి, అచ్యుతారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, కృష్ణ, శేఖర్‌గౌడ్, శ్రీనివాసులు, తిరుపతయ్య, ప్రతాప్‌రెడ్డి, నిరంజన్, ఫార్మాసిస్ట్ శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న అర్చకులు

ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

నాగర్‌కర్నూల్‌టౌన్, జూన్ 15 : జిల్లాలోనే అత్యంత పురాతన ఆలయాల్లో ఒకటైన శ్రీపురం శ్రీరంగనాథ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. స్వామివారికి ఆలయ ధర్మకర్త రంగాచార్యులు, ప్రధాన అర్చకులు వినోదాచార్యులు, మురళిధరాచార్యులు, అచ్యుతాచార్యులు పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

శనైశ్చరుడికి ప్రత్యేక పూజలు

బిజినేపల్లి, జూన్ 15 : మండలంలోని వడ్డేమాన్ గ్రామంలో గల శనైశ్చరస్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి తిలతైలాభిషేకాలు, అర్చనలు చేశారు. దోషాలు తొలగించాలని స్వామివారికి పూజలు చేశారు. అనంతరం సమీపంలోని నందీశ్వరాలయంలో పరమశివుడికి పంచామృతాభిషేకాలు, అర్చనలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ గోపాల్‌రావు, అర్చకులు విశ్వనాథశాస్త్రి, శాంతకుమార్, ఉమామహేశ్వర్, కమిటీ సభ్యులు వీరశేఖర్, గోపాల్‌రెడ్డి, భక్తులు ఉన్నారు.

పండిత్ ప్రమోషన్లలో ఎస్జీటీలకు అవకాశం ఇవ్వాలి

- టీఎస్ పీటీఏ జిల్లా అధ్యక్షుడు బోరెల్లి రాజు
- నల్లబ్యాడ్జీలతో నిరసన

నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కోడేరు, జూన్ 15 : రాష్ట్రంలో ఉన్న 70వేల మంది ఎస్జీటీలను కాదని కేవలం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు ఉందనే సాకుతో పండిత ప్రమోషన్లలో వంద శాతం పండితులకే ఇవ్వటం చాలా అన్యాయమని వెంటనే ఎస్జీటీలకు అవకాశం కల్పించాలని టీఎస్ పీటీఏ జిల్లా అధ్యక్షుడు బోరెల్లి రాజు డిమాండ్ చేశారు. ఎస్జీటీలు రాష్ట్రవ్యాప్త ఆందోళన కార్యక్రమంలో భాగంగా మండలంలోని మైలారం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీలకు ఓటుహక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పోస్టును డీఈఓ చదివిన వారితోనే నింపాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు సంబంధం లేకుండా ఉపాధ్యాయ పోస్టులను కేటాయిస్తున్నట్టుగానే ప్రతిప్రాథమిక పాఠశాలకు తరగతి గదికొక ఉపాధ్యాయున్ని నియమించాలన్నారు. లేనిచో ప్రాథమిక ఉపాధ్యాయ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఈశ్వర్, నరసింహ, కురుమయ్య, అగ్గురయ్య పాల్గొన్నారు.

10వేల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యం

ఆలయంలో పూజలు చేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

వెల్దండ, జూన్ 15 : కల్వకుర్తి నియోజకవర్గంలో యువతకు 10వేల ఉద్యోగాలు కల్పించడమే ఐక్యత ఫౌండేషన్ లక్ష్యమని ఆ సంస్థ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం వెల్దండ మండలం పోచమ్మగడ్డతండాలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేశారు. అంతకముందు పోతెపల్లిలో నిర్మాణంలో ఉన్న హన్‌మాన్ ఆలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకున్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు వెంకటమ్మ, టాక్యానాయక్, ఎంపీటీసీ కాడురాం, నాయకులు అజీత్‌నాయక్, తానేశ్, రాము, రవి, కిరణ్, ఠాకురాం, లాలు, రఘు, విజయ్, రమేశ్ పాల్గొన్నారు.

నీటిగుంతలో పడి రైతు మృతి

బిజినేపల్లి, జూన్ 15 : వ్యవసాయ పొలంలోని నీటి గుంతలోపడి రైతు మృతి చెందిన ఘటన మండలంలోని మహదేవునిపేటలో శనివారం చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు మహదేవునిపేట గ్రామానికి చెందిన కరుణాకర్‌రెడ్డి(48) రోజులాగే తన పొలానికి వెళ్లాడు. ఈ క్రమంలో పొలంలో ఉన్న నీటిగుంతలో ప్రమాదవశాత్తు పడ్డాడు. ఆ సమయంలో చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో మృతి చెందినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. కరుణాకర్ ఎంతకి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వారు పొలంలో వెతకాగా నీటి గుంతలో పడి మృతి చెందాడు.

తప్పిన పెనుప్రమాదం

బిజినేపల్లి, జూన్ 15: మండల కేంద్రంలో శనివారం తృటిలో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం మేరకు నారాయణపేట బీజేపీ కౌన్సిలర్ మేఘ తన పిల్లలకు వనపర్తి జిల్లా గోపాల్‌పేటలో వైద్య చికిత్సలకోసం శనివారం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో గోపాల్‌పేట నుంచి వయా బిజినేపల్లి మీదుగా నారాయణపేటకు వెళ్తుండగా బిజినేపల్లిలోని వనపర్తి రోడ్డులో హెవీలైన్ కరెంట్ స్తంభానికి వారు ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న మేఘకు స్వల్పంగా గాయపడగా గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

కబడ్డీ కోచ్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

నాగర్‌కర్నూల్/కల్వకుర్తి రూరల్, జూన్ 15: ఖేలో ఇండియా కబడ్డీ కోచ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడల అధికారి సీతారం శనివారం ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వారి ఆదేశాల మేరకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వారు నాగర్‌కర్నూల్ జిల్లాలో ఖేలో ఇండియా భాగంగా కల్వకుర్తి మినీ స్టేడియంలో ఖేలో ఇండియా కబడ్డీ సెంటర్‌ను మంజూరు చేశారన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆసక్తి, అర్హత గల కబడ్డీ క్రీడాకారులు ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడల అధికారి పేర్కొన్నారు. దరఖాస్తుదారులు 40 ఏండ్లలోపు వయస్సు ఉండాలని, దరఖాస్తుదారులు తమ దరఖాస్తుతోపాటు స్పోర్ట్స్ సర్టిఫికెట్లు జిరాక్స్ కాపీలతో స్వయంగా నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లోని జిల్లా యువజన క్రీడల అధికారి కార్యాలయంలో రూమ్ నెంబర్ జి1, ఐవోసీ బిల్డింగ్ కలెక్టరేట్ బిల్డింగ్‌లో ఇవ్వాలని కోరారు.

నైట్ వాచ్‌మెన్‌కు..

ఉప్పునుంతల, జూన్ 15 : మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నైట్ వాచ్‌మెన్ మహిళా పోస్టు ఖాళీగా ఉందని స్పెషల్ ఆఫీసర్ సైదా శనివారం ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన వారు ఈనెల 18 లోగా ధ్రువీకరణ పత్రాలను కేజీబీవీలో అందజేయాలన్నారు.

తండాలో వైద్య శిబిరం

తిమ్మాజిపేట, జూన్ 15 : తిమ్మాజిపేట మండలం లక్ష్మణ్ నాయక్ (బాజీపూర్)తండాలో శనివారం రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తండావాసులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో యూసుఫ్, ఉమేర్, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ గౌస్, రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధి కుమార్, జ్యోత్స్న, రజియా, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

ఉప్పునుంతల, జూన్ 15 : ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్మించిన ప్రహరీని అధికారులు జేసీబీతో కూల్చివేయించారు. వివరాలిలా.. మండలంలోని మామిళ్లపల్లిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన రాజల్‌రావు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ప్రహరీని నిర్మించారు. దీంతో గ్రామస్తులు డీపీవో కృష్ణకు ఫిర్యాదు చేయడంతో ఆయన నోటీసులు పంపించారు. ఈక్రమంలో రాజల్‌రావు స్పందించకపోవడంతో శనివారం డీఎస్పీ శ్రీనివాసులు సమక్షంలో జేసీబీతో ప్రహరీని కూల్చివేశారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో వెంకటయ్య, ఎంపీవో నారాయణ, ఏఎస్సై సుజ్ఞానం ఉన్నారు.

జూలైలో వరినారు పోసుకోవాలి

బిజినేపల్లి, జూన్ 15 : రైతులు జూలైలో వరినారు పోసుకోవాలని పాలెం ప్రాంతీయ వ్యవసాయ కేంద్రం ఏడీఆర్ మల్లారెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. తెలంగాణ సోన అనే వరి రకాన్ని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతులు ఎక్కువ మొత్తం విస్తీర్ణంలో సాగు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాబట్టి రైతులు జూలై మొదటి వారంలో వరినారు పోసుకోవాలని సూచించారు. జూలై మొదటి వారంలో నారుపోసుకుంటే నత్రజని పెరుగుతుందని పేర్కొన్నారు.

భూములు కౌలుకు ఇవ్వొద్దు

ఊర్కొండ, జూన్ 15 : దేవాలయ భూముల్లో కౌలు నిలిపి వేయాలని కాంగ్రెస్ నాయకులు మండల తాసీల్దార్ చిన్నకిష్టప్పాకు వినతి పత్రం అందజేశారు. మండలంలోని ఊర్కొండపేట పబ్బాతి ఆంజనేయస్వామి ఆలయ భూముల్లో ఆలయ ఈవో సత్యాచంద్రారెడ్డి కమిటీ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా శుక్రవారం కౌలుకు ఇచ్చారని వారు పేర్కొన్నారు.

చిరుధాన్యాలతో అధిక దిగుబడులు

సార్లపల్లిలో చిరుధాన్యాల ఆవశ్యకతను వివరిస్తున్న ఏఈవో భార్గవి

అమ్రాబాద్, జూన్ 15 : చిరుధాన్యాలతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ విస్తరణ అధికారి భార్గవి అన్నారు. శనివారం కోనేరు సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని వటవర్లపల్లి, సార్లపల్లి, కుడిచింతలబయిలు గ్రామాలకు చెందిన ఆదివాసీ చెంచు, గిరిజన రైతులకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాల సాగుకు తీసుకోవాల్సిన చర్యలు, పాటించాల్సిన నియమాలు, ఎరువుల వాడకం వంటి అంశాలను వివరించారు. కోనేరు సంస్థ చెంచుల కోసం వివిధ రకాల వనరుల శిక్షణా కేంద్రాలను ఏర్పాటుచేసి వ్యవసాయ పనిముట్లతో పాటు ఆహార విత్తనాలు, కూరగాయల విత్తనాలను అందించినట్లు సంస్థ ప్రాజెక్టు మేనేజర్ ఇస్మాయిల్ తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, రైతులు తిరుపతయ్య, బయన్న, ఈదయ్య, గురువయ్య, మల్లయ్య, పెద్దులు, ముత్తమ్మ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ తాగునీటి నల్లాలపై సర్వే

సర్వేను పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో జ్యోతి

తాడూరు, జూన్ 15 : మండలంలోని ఆయా గ్రామాల్లోని మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై అధికారులు ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే ఎంపీడీవో జ్యోతి పరోసియా శనివారం మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో మొత్తం 24 గ్రామ పంచాయతీల్లో 9,735 మిషన్ భగీరథ తాగునీటి నల్లాలు ఇవ్వడం జరిగిందన్నారు. సంబంధిత అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి మిషన్ భగీరథ తాగునీరు ఎలా సరఫరా అవుతుందనే విషయంపై కుటుంబ సభ్యులతో మాట్లాడి ఇంటి యాజమాని ఫొటో తీసి ఆన్‌లైన్ నమోదు చేశారు. సకాలంలో సర్వే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆమె సూచించారు.

మున్సిపల్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

నాగర్‌కర్నూల్‌టౌన్, జూన్ 15 : మున్సిపల్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధా న కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కమిషనర్ నరేశ్ కు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామయ్య, కార్మికులు కుర్మయ్య, పరశురాములు, వెంకటయ్య, కృష్ణ, బాలస్వామి, వెంకటయ్య, ఎల్లమ్మ, లక్ష్మిదేవి, కృష్ణమ్మ, భారతమ్మ, లక్ష్మి ఉన్నారు.

కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బ్యాగులు పంపిణీ

తాడూరు, జూన్ 15 : మండలంలోని యత్మతాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 30 మంది విద్యార్థులకు ఆదే గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ సింగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కుమారుడు హైదరాబాద్ క్లాస్‌మెట్ క్లబ్ ప్రతినిధి రణధీర్‌రెడ్డి ఆర్థిక సాయంతో బ్యాగులను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తు చేసుకోవాలి

ఊర్కొండ, జూన్ 15 : ఆయిల్‌పాం సాగు కోసం అసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలని హార్టికల్చర్ క్లాస్టర్ అధికారి కే.మహేశ్ గౌడ్ శనివారం తెలిపారు. దరఖాస్తు చేసుకునే రైతులు కల్వకుర్తిలోని హార్టికల్చర్ కార్యాలయానికి రావాలని, వివరాలకు 9908468601ను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

ఎన్ఎన్ఎంఎస్ పరీక్షలో ప్రతిభ చాటిన విద్యార్థులు

విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కల్వకుర్తిరూరల్/చారకొండ, జూన్ 15 : కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన స్కాలర్‌షిప్ టాలెంట్ టెస్ట్(ఎన్ఎన్ఎంయూ) పరీక్షలో తాండ్ర జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో పాఠశాలకు చెందిన సాయికిరణ్, దీప్తి, శిరీషలు తమ ప్రతిభను చాటారు. ముగ్గురు విద్యార్థులకు తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు ప్రతి ఏటా రూ.12వేల చొప్పుల స్కాలర్‌షిప్ అందుకోనున్నారని హెచ్ఎం జహంగీర్, ఉపాధ్యాయురాలు రాజ్యలత తెలిపారు. అదేవిధంగా చారకొండ మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఏలే అభినవీశ్వరి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్(ఎన్ఎంఎంఎస్)కు ఎంపికైనట్లు జీహెచ్ఎం భగవాన్‌రెడ్డి శనివారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను జీ హెచ్ఎం భగవాన్ రెడ్డి, ఉపాధ్యాయులు, అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయు లు యాదగిరి, కమలాకర్‌రావు, అంజయ్య, రాజేందర్‌రెడ్డి, నవీన్, గౌరమ్మ పాల్గొన్నారు.

మండలానికి ఏడుగురు హెచ్ఎంలు రాక

వంగూరు, జూన్ 15 : మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు కొత్తగా ఏడుగురు హెచ్ఎంలు బదిలీపై వచ్చినట్లు ఎంఈవో శంకర్‌నాయక్ శనివారం ప్రకటనలో తెలిపారు. వేసవి సెలవులకు ముందు ఆయా పాఠశాలలకు చెందిన హెచ్ఎంలు బదిలీఅయ్యారు. వంగూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎంగా మదన్ మోహనాచారి, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎంగా సుదర్శన్‌రెడ్డి, గాజర పాఠశాలకు హేమలత, డిండిచింతపల్లి పాఠశాల హెచ్ఎంగా లలిత, ఉల్పర పాఠశాల హెచ్ఎంగా వసంతాదేవి, రంగాపూర్ పాఠశాల హెచ్ఎంగా సుధారాణి, పోల్కంపల్లి పాఠశాల హెచ్ఎంగా సీతారామ్ రెడ్డి బదిలీపై వచ్చినట్లు ఎంఈవో పేర్కొన్నారు.

ఇరువురిపై కేసు నమోదు

పెద్దకొత్తపల్లి, జూన్ 15 : మండలంలోని మారెడుమాన్‌దిన్నె తండాలో శనివారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి 16 లీటర్ల సారా, బెల్లంఊటను ధ్వంసం చేశారు. అనంతరం ఇద్దరిని అరెస్టు చేసి తాసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

సర్కారు బడుల్లో మెరుగైన విద్య

లింగాల, జూన్ 15 : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతున్నదని జీహెచ్ఎం బషీర్ అహ్మద్ అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీహెచ్ఎం మాట్లాడుతూ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసకుంటున్నదన్నారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులతోపాటు సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు అందిస్తున్నదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేఖర్, వెంకట్ రాజు, శ్రీను, అరవింద్, పరశురాములు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

REAL ESTATE
★హైదరాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, కోదాడ పరిసర ప్రాంతా